# చంటిపిల్ల

శ్రీ కృత్తివాసతీర్థులు

రాత్రి ఎనిమిదిగంటలు వేశారు కోటలో. ముసలావిడ జపమాల తిప్పుకొంటూ వంటింటి గుమ్మందగ్గిర కూర్చొన్నది. కొవ్వువత్తి దీపం వెలుగుతోంది. చంటి ఏడ్చి ఏడ్చి ఉయ్యాల్లో పరుండి ఇంకా రాగం తగ్గించలేను. వాళ్ళమ్మ, చంటి ఎప్పుడు నిద్రపోతుందా మెల్లిగావెళ్లి రెండు మెతుకులు తినివచ్చి పరుందామా అని త్వరపడుతోంది. అస్తమానం చంటిపిల్లతో వేసారిపోతోంది. చంకదిగదు, తల్లిని ఎత్తుకు తిప్పమంటుంది. సూరమ్మకు మడిపని, ముట్టుకోడానికి తీరుబాటే వుండదు. అట్టే ముసలావిడే ఓపక్కని చంటిని సముదాయిస్తూంటే వాళ్ళమ్మనుచూస్తో, ఇంటిల్లి పాచిపని చేసుకొంటుంది. అరవై యేళ్లు దాటినై. ముసలావిడ ఏదో శాస్త్రం చదువుకొన్నదైతే పట్టుమని నలుగురూచేరి షష్టిపూర్తిచేసేవారు. పెద్దదయ్యాక, ఆవిడ చేత అస్తమానం పని చేయించుకోవడం అట్టే బాగులేదని సూరమ్మకు తెలుసు. సూరమ్మ పొంగుచూపిన యావ్వనంలో వున్నా ఓపిక తక్కువ. అందులో చంటి పుట్టినప్పటినుంచీ సలాకలాగ బక్కపలాచగా అయిపోయింది. చిన్నతనంవల్ల పిల్లని సముదాయించుకోలేక ఊరికేకసురుకొంటుంది.

ఎంతసేపటికీ నిద్దురోకపోయేసరికి విసుగెత్తి "మాయదారిపిల్లలు—పిల్లలు లేకుంటే పీడాయింది. కావాలని యెవరు యేడ్చేరు? వెధవపీనుగ ఎంతసేపటికి కన్నుమూయదు" అని సూరమ్మ కేక లెట్టింది. చంటి కేరుమంది.

ముసలావిడ అమ్మాయి అల్లా అంటూ వుంటే ఊరుకోలేక "ఎందుకే దాన్ని అలా గంటావు. పిల్లలు లేకపోతే లేరనీ, ఉంటే ఇలాగ—చిన్నదానివి నువ్వేఈలాగ అనుకొంటే మాకాలాల్లో మే మెలా చేసే వాళ్ళమమ్మా. ఏదో సముదాయించుకోవాలి. పిల్లలంటే అంత జడుపెందుకు?" అన్నది.

సూరమ్మ ఏమీ అనలేదు. చిగురుకు మెలాగో చంటి నిద్రపోయింది. వానవెలిసినట్టయింది. రవి దీపంముందు కూర్చొని బళ్లో పాఠాలన్నీ ఏకరు వెడుతున్నాడు. ముసలావిడ జపం ముగిసింది. సూరమ్మ తనూ భోజనానికి కూర్చున్నారు. రవి ఆకలి లేదని అన్నం మానేశాడు.

'రవీ, చంటిలేస్తే తొట్టె ఊపమ్మా. మేము లేచేదాకా కనిపెట్టిచూస్తూవుండు' సూరమ్మ తమ్ముడితో అన్నది.

భోజనాలు అయినాయి. పదిగంటలు దాటాయి. రవికి నిద్దరొచ్చేసరికిపుస్తకాలు అక్కడే పడేసి చాపమీదనే నిద్రపోతున్నాడు. దీపం జాగంటలా వెలుగుతోంది. కొంచెంసేపటికి మళ్ళీ చంటి రాగా లెడుతూ, తల్లి కనిపించలేదని వుక్కిరి బిక్కిరవుతోంది. ముసలావిడ సూరమ్మ వోపిక కనిపెట్టి తనే పిల్లను

ఎత్తుకొని ఆడించడం మొదలెట్టింది. నాన్న గారు ఊరికెళ్ళి బిసకత్తులు తెస్తారనీ, బండీ ఎక్కి ఉప్పాడ వెడదామనీ, పెరట్లో తువ్వాయి చెంగుచెంగున గంతులేస్తున్న దనీ కబుర్లు చెపుతూ చంటికి పాలోసింది.

ఇంతలోకే వాళ్ళనాన్నగారు వచ్చి చంటిని ఎత్తుకొని తమలపాకులు నములుతూ వెన్నెల్లోకి ఎత్తుకు తీసుకుపోయేరు. పెర ట్లో మందార గులాబీలు బాగా వికసించి ఎంచక్కా వున్నాయి. పోకచెట్లు గాలికి ఊగిసలాడిపోతున్నాయి. గుబురుగా వున్న సంపెంగ, మాలతీ ఆకుల సందు ల్లోంచి లేతవెన్నెల ప్రసరిస్తోంది. ప్రతీ మొక్క దగ్గరికీ వచ్చి "చంటీ ఇలా చూ డమ్మా! ఆకులు ఇంచక్కా గాలికి అల్ల లాడుతున్నాయి. అవిగో ఆపూలు తల్లో పెట్టుకుంటావా? చెప్పుతల్లీ," అన్నాడు.

'అద్దు, ఊహుఁ ఊహుఁ అమ్మా' అంటూ రాగాలెడుతున్నది. కొంచెం సేప టికి చంటికి, కిచకిచలు పెట్టి నవ్వు తెప్పిం చేడు. కళ్ళమ్మట అమ్మాయికి నీళ్ళు కారుతున్నాయి. హాలులోకి వచ్చి దీపం పెద్దదిచేసి "జేజి చూపెట్టమ్మా, తల్లీ జేజికి దణ్ణం పెట్టమ్మా" అనేసరికి చంటినవ్వింది. దీపం ముట్టుకోబోయింది. "వద్దు చెయ్యి కాలుతుందిస్మా" అనేసరికి మళ్ళీ ఏడ్చింది.

తెల్లారింది. చంటి నిద్దరోయి లేచింది. పక్కమీద నుంచి లేవడంతోటే రాగా లెడుతూ లేచింది అమ్మ కనపడక పోయే సరికి నాలుగువేపులా చూసింది.రవిని పిల్చి చంటికి గిలకలు ఆటబొమ్మలూ ఇమ్మని చెప్పి తను పనిలోకి చక్కాపోయింది.

రవి ఏమిటేమిటో కబుర్లు చెబుతూ గిలకలు గిలకరిస్తూ ఆడిస్తున్నాడు. చెప్పీ ప్రతిమాటకు చంటి ఊకొడుతోంది.

ఇంతలోకే మరమరాల అబ్బి వాక ట్లోకి వచ్చి గంటమోగించేడు. చంటి మామూలు ప్రకారం రాగాలాపనచేసింది. రవి డబ్బెట్టి కాసిన మరమరాలు కొని పెట్టేడు. ఒక్కొక్క గింజ ఏరుకొంటో గుర్రంతోకకి పొడుగుపాటితాడుకట్టిలాగు తోంది. మరమరాలసెట్టి చంటి చేసే పని చూస్తో నవ్వుకొంటూ కొంచెంసేపువూరికే నిలవబడ్డాడు. అతగాడు రోజూ చంటిపిల్ల లున్న వేపుకే అమ్మడానికి వస్తాడు. రోజూ చంటి కొనిపెట్టమని అడుగుతుంది.

—కథావింశతినుండి